క్లుప్తంగా

నిస్వార్థ ప్రజా సేవకుడు లక్ష్మణరావు



అమరావతి: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావును గెలిపించాలని శనివారం వైకుంఠపురం, అమరావతి బండచేనులో సీపీఎం ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఓటర్లను కలిసి లక్ష్మణరావుకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కరపత్రాలు పంపిణీ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు మాట్లాడుతూ నిస్వార్థ ప్రజా సేవకుడు, ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, ప్రజల గొంతుకై నిరంతరం వారి సమస్యలపై శాసన మండలిలో పోరాడే కేఎస్ లక్ష్మణరావును గెలిపించడం విద్యావంతుల బాధ్యతన్నారు. ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మోడల్ టెస్ట్ పేపర్లు పంపిణీ



గోళ్లపాడు(ముప్పాళ్ళ): గోళ్లపాడు కేజీబీవీలోని పదవ తరగతి విద్యార్థినులకు యూటీఎఫ్ రూపొందించిన మోడల్ టెస్ట్ పేపర్స్‌ను శనివారం పంపిణీ చేశారు. మంచి మార్కులు సాధించేందుకు ఇవి ఎంతగానో దోహదపడతాయని యూటీఎఫ్ నాయకుడు ముప్పా సురేష్ అన్నారు. మొత్తం 38 మంది విద్యార్థులకు మల్లెల పద్మశ్రీ, వైద్యురాలు అరుణకుమారి ఆర్థిక సాయంతో వీటిని అందించామని తెలిపారు. సభ్యుడు సతీష్, పాఠశాల ప్రత్యేక అధికారి సుహృలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించి సహకరించాలి

సత్తెనపల్లి: పుర ప్రజలు ఇంటి, ఖాళీ స్థలం పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి శనివారం కోరారు. 2024–25 సంవత్సరానికి బకాయిలు ఈ నెల 28 వరకు మాత్రమే అపరాధ రుసుంతో చెల్లించడానికి అవకాశం ఉందన్నారు. నీటి పన్ను వెంటనే చెల్లించాలని, లేకుంటే కొళాయి కనెక్షన్ తొలగించ బడుతుందన్నారు. వ్యాపారులు ట్రేడ్ లైసెన్సు ఫీజు అపరాధ రుసుం లేకుండా చెల్లించవచ్చన్నారు.

వృద్ధాశ్రమానికి గ్యాస్ పొయ్యి, ర్యాక్ వితరణ



సత్తెనపల్లి: వృద్ధాశ్రమాలకు ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలని బ్యాంక్ ఆఫ్ బరోడా పాలడుగు శాఖ మేనేజర్ కేఏఎస్ మనోజ్‌కుమార్ అన్నారు. సత్తెనపల్లిలోని ఆదరణ అనాథ వృద్ధుల శరణాలయానికి శనివారం బ్యాంకు తరపున సీఎస్ఆర్ యాక్టివిటీ కింద రూ.5 వేలు విలువ గల గ్యాస్ పొయ్యి, దుస్తులు దాచుకోవటానికి రెండు ర్యాక్‌లను వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ జాకీర్ హుస్సేన్, హెడ్ క్యాషియర్ చిలక శ్రీనివాసరావు, ప్రదీప్, కృపామణి, బాజీ, పాల్గొన్నారు. దాతలకు నిర్వాహకులు కొమ్మువరపు ఇంద్రసేన బాబు, కె.రిషిత కృతజ్ఞతలు తెలిపారు.

గీత కార్మికులకు 3 మద్యం దుకాణాలు



సత్తెనపల్లి: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సత్తెనపల్లి సర్కిల్ స్టేషన్ పరిధిలోని సత్తెనపల్లి మున్సిపాలిటీ, ముప్పాళ్ల, రాజుపాలెం మండలాల్లోని గీత కార్మికులు, గౌడ కులస్తులకు మండలానికి ఒకటి చొప్పున 3 మద్యం దుకాణాలు మంజూరయ్యాయని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.విజయ్ కుమార్ తెలిపారు. శనివారం గీత కార్మికులు, గౌడ కులస్తులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 5న సాయంత్రం 5 గంటలలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తుకు తహసీల్దార్ ప్రత్యేకంగా జారీ చేసిన గౌడ సబ్‌కాస్ట్, నేటివిటీ సర్టిఫికెట్లు తప్పనిసరిగా జత చేయాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వారికున్న సందేహాలను నివృత్తి చేశారు. ఎస్ఐ నాగలక్ష్మి పాల్గొన్నారు.

రేపు సరస్వతీదేవి పూజ

సత్తెనపల్లి: వసంత పంచమి సందర్భంగా పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం ఉదయం 8 గంటలకు సరస్వతిదేవి ఉత్సవమూర్తికి స్నపన తిరుమంజనం, విశేష పూజ జరుగుతుందని ఆలయ అర్చక స్వామి శ్యాము ఆచార్య రామానుజ స్వామి శనివారం తెలిపారు. విద్యార్థులు పుస్తకాలు తెచ్చుకుంటే ప్రత్యేకంగా పూజ చేసి, అమ్మవారి అక్షింతలు, కుంకుమ, పెన్సిళ్లు అందజేస్తామని చెప్పారు.

పనిచేయని కియోస్క్‌లు

- ఆర్బీకేలు రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్పు
- సేవల కల్పనలో విఫలమైన కూటమి ప్రభుత్వం
- నిర్లక్ష్యంతో మూలకు చేరిన కియోస్క్ యంత్రాలు
- డిజిటల్ ఆధారిత సేవలు కనుమరుగు
- కోట్ల రూపాయల ప్రజాధనం వృథా



గోళ్లపాడులోని రైతు భరోసా కేంద్రం

ముప్పాళ్ళ: రైతు సేవా కేంద్రాలుగా మారిన గత ఆర్బీకేల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం డిజిటల్ ఆధారిత సేవలకు ఈ–మల్టీ ఫంక్షనల్ కియోస్క్‌లను అందుబాటులోకి తెచ్చింది. ప్రతి ఆర్బీకేకు ఒకటి చొప్పున కేటాయించింది. ప్రముఖ కంపెనీల విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల ధరలు, రైతులు పండించిన వ్యవసాయోత్పత్తులకు మార్కెట్ రేటు, సమీపంలోని మార్కెట్ల వివరాలు, అక్కడి ధరలు కియోస్క్‌లో డిస్‌ప్లే అయ్యేవి. రైతులు కావాల్సిన పురుగు మందులను, ఎరువులను నేరుగా కియోస్క్ ద్వారా బుక్ చేసుకునేవారు. ముఖ్యంగా వాతావరణ సమాచారం, మార్పులు, ఏ సీజన్‌లో ఏ పంటలు సాగు చేస్తే మంచి ఫలితాలు పొందవచ్చో వంటి సమాచారం ఇక్కడ లభించేది. నాడు రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉన్న కియోస్క్ సేవలు కూటమి ప్రభుత్వం పాలనలో కుయ్యో.మొర్రో అంటూ మూలకు చేరాయి.

ఆర్బీకే ఒక విప్లవం

రైతు శ్రేయస్సుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిచ్చింది. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. విత్తనాలు, పురుగు మందుల కోసం రైతులు కష్టాల పడకూడదనే ఉద్దేశంతో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పలు చర్యలు తీసుకున్నారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు చేసి, రైతుల వద్దకే సేవలను అందుబాటులోకి తెచ్చారు. విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు ఎమ్మార్పీకే రవాణ సమస్య లేకుండా రైతులకు స్థానికంగా అందేలా చేశారు. ప్రధానంగా ఆర్బీకేల్లో కియోస్క్‌ల సాయంతో సాంకేతికంగా రైతులు ముందుకు తీసుకెళ్లేలా చూశారు. అందులో విజ్ఞానంతో కూడిన వ్యవసాయ పుస్తకాలను అందుబాటులో ఉంచారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతు భరోసా కేంద్రాలకు పేరు మార్పు చేసింది. ఆర్బీకేల లక్ష్యాన్ని విస్మరిస్తూ ఒక్కో సేవను నిర్వీర్యం చేసే దిశగా ముందుకు సాగుతుంది. రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్పుకే కూటమి ప్రభుత్వం పరిమితమైందే కానీ, అందులోని సేవలను మాత్రం అందించలేకపోయింది. రైతు సే వాకేంద్రాల్లోని కియోస్క్‌లు పనిచేయకపోవడం అన్నదాతలకు శాపంగా మారింది.



ముప్పాళ్లలో మూలకు చేరిన కియోస్క్ యంత్రం

ప్రజా ధనం నిరుపయోగం..

సత్తెనపల్లి నియోజకవర్గంలోని ఆర్బీకేలకు గత ప్రభుత్వం 61 కియోస్క్ యంత్రాలను కేటాయించింది. కూటమి ప్రభుత్వంలో రైతు సేవా కేంద్రాలపై నిర్లక్ష్యం మొదలైంది. ఇందులోని సేవలన్నీ మాయమయ్యాయి. సాంకేతిక సమస్యల వల్ల కేంద్రాల్లోని కియోస్క్ యంత్రాలు పని చేయక మూలకు చేరాయి. రూ.లక్షల విలువైన ఈ యంత్రాలు ఇప్పుడు దిష్టిబొమ్మలుగా మారాయి. కొన్ని చోట్ల ఇవి బాగున్నా ఇంటర్నెట్ లేదంటూ సేవలు నిలిపివేశారు. దీంతో కోట్లాది రూపాయాల ప్రజాధనం నిరుపయోగమైంది. కియోస్క్‌లు ఉన్నప్పటికీ అవి రైతులకు మేలు చేయని దుస్థితి నెలకొంది.

కియోస్క్‌తో ఎంతో ప్రయోజనం



రైతు సేవా కేంద్రాలు గత ప్రభుత్వంలో మాదిరి లేవు. గతంలో రైతులకు అవసరమైన ఎన్నో సేవలు అందుబాటులో ఉండేవి. ఎరువులు ఎప్పుడు కావాలంటే అప్పుడు తీసుకొని వెళ్లే వాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. కియోస్క్ కూడా పనిచేయడం లేదు.

–లోకసాని నర్సిరెడ్డి, ముప్పాళ్ల

ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం



సాంకేతిక సమస్యల కారణంగా రైతు సేవా కేంద్రాల్లోని కియోస్క్‌లు పనిచేయడం లేదు. ఆయా ఆర్ఎస్కేల్లో ఎన్ని పని చేయడం లేదో తెలుసుకొని సమస్యపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించాం.

–ఎం.అరుణ, ఏఓ, ముప్పాళ్ల

సెలవు రోజుల్లోనూ మధ్యాహ్న భోజనం



పట్టణంలో ప్రత్యేక తరగతుల్లో టెన్త్ విద్యార్థులు

- టెన్త్ విద్యార్థులకు నేటి నుంచి అమలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు
- నియోజకవర్గంలో 2,651 మంది పదో తరగతి విద్యార్థులు

సెలవు రోజుల్లో భోజనం మెనూ ఇలా..

రెండో శనివారం: అన్నం, సాంబారు, కాయగూరలతో కర్రీ, చక్కెర పొంగలి.
ఆదివారం: పలావు, కోడిగుడ్డు కూర, చిక్కి.

సత్తెనపల్లి: పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో 100 రోజుల ప్రణాళిక అమలు చేస్తోంది. అదనపు తరగతులతో పాటు రెండో శని, ఆదివారాల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. ఇప్పటి వరకు పాఠశాల పని వేళల్లో మాత్రమే మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. తాజాగా పదవ తరగతి విద్యార్థులకు సెలవు రోజుల్లోనూ మధ్యాహ్న భోజనం సమకూర్చాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఆదివారం నుంచి మార్చి 10వ తేదీ వరకు ఈ సదుపాయం కల్పించనుండడంతో ఇంటి నుంచి క్యారేజీ తెచ్చుకునే ఇబ్బందులు ఉండవని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సత్తెనపల్లి నియోజకవర్గంలో..

సత్తెనపల్లి నియోజకవర్గంలో సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో 39 జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో పదో తరగతి విద్యార్థులు 2,651 మంది చదువుతున్నారు. మార్చి 17 నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఉత్తీర్ణత శాతం పెంచాలనే లక్ష్యంతో పాఠశాలల్లో గత ఏడాది డిసెంబర్ ఒకటి నుంచి వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తోంది. ఉపాధ్యాయులు విద్యార్థులను దత్తత తీసుకుని చదివిస్తున్నారు. పాఠశాల పని వేళల్లో ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. దీనికి తోడు రెండో శని, ఆదివారాల్లో కూడా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు ఎక్కువ శాతం గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు కావడం, దూర ప్రాంతాల నుంచి రావాల్సి ఉండటంతో తరగతులకు క్యారేజీలు తెచ్చుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ కారణంగానే కొంతమంది పాఠశాలలకు రావడం లేదు. ఈ విషయం విద్యాశాఖ దృష్టికి వెళ్లడంతో సెలవు రోజుల్లోనూ మధ్యాహ్న భోజనం పెట్టాలని నిర్ణయించారు. దీంతో తరగతులకు హాజరయ్యే విద్యార్థుల సంఖ్య పెరుగు తుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. దీనిపై ఉత్తర్వులు అందాయని ఆదివారం నుంచి అమలు చేస్తామని సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు.

కానుకమాత ఆశీస్సులతో మహాన్నదానం

ఫాదర్ వైఎల్ మర్రెడ్డి

రెంటచింతల: స్థానిక కానుకమాత చర్చి 175వ వజ్రోత్సవ తిరుణాళ్ల మహోత్సవం సందర్భంగా శనివారం సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల మైదానంలో మహాన్నదానం కార్యక్రమం దిగ్విజయంగా నిర్వహించినట్లు చర్చి విచారణ గురువులు రెవ.ఫాదర్ ఏరువ లూర్దుమర్రెడ్డి తెలిపారు. అనేక ప్రాంతాల నుంచి తరలి వచ్చిన సుమారు 18 వేల మంది భక్తులకు అన్నదానం చేపట్టినట్లు వెల్లడించారు. చర్చి పెద్దలు, జపమాల, నిర్మలమాత, కానుకమాత, ఆరోగ్యమాత, లూర్దుమాత తదితర సభలకు చెందిన మహిళలు ఈ అన్నదాన కార్యక్రమంలో విశేషంగా సేవలు అందించారని వారికి ప్రత్యేకగా కృతజ్ఞతలు తెలిపారు. కానుకమాత చల్లని దీవెనలతో గ్రామంలో ముందెన్నడూ లేనివిధంగా చేపట్టిన ఈ మహాకార్యానికి సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో నవదిన ప్రార్థనలు

రెంటచింతల: స్థానిక కానుకమాత చర్చి 175వ వజ్రోత్సవ తిరుణాళ్ల మహోత్సవంలో భాగంగా శనివారం అంథోనివారి కాలనీలోని అంథోనివారి మందిరంలో నవదిన ప్రార్థనలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కానుకమాత చర్చి విచారణ గురువులు రెవ.ఫాదర్ ఏరువ లూర్దుమర్రెడ్డి నేతృత్వంలో మండాది విచారణ గురువులు రెవ.ఫాదర్ రత్నకుమార్ సహాయ గురువులు రెవ.ఫాదర్ అగస్టీన్‌తో కలిసి పవిత్ర సమష్టి దివ్యబలిపూజను నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ రత్నకుమార్ భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రైస్తవులు ప్రతి రోజు దేవునిచే ఎన్నుకోబడిన మరియతల్లిని ప్రార్థించాలన్నారు. కనికరం కల్గిన మరియతల్లి విశిష్టతను వివరించారు. కథోలిక్కులు కరుణమయురాలైన ఆ తల్లి ఆశీస్సులు తప్పకుండా పొందుతారన్నారు. ఈ దివ్యపూజాబలిలో చర్చి పెద్దలు, కన్యాస్త్రీలు, భక్తులు పాల్గొన్నారు.



కానుకమాత చర్చిలో నిర్వహించిన మహాన్నదానం

సైబర్ నేరాలపై అప్రమత్తత తప్పనిసరి



రాజుపాలెం: సైబర్ నేరాలపై గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని, కొత్త వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ వేణుగోపాల్ కోరారు. మండలంలోని పెదనెమలిపురి, వీరమ్మ కాలనీల్లో గ్రామస్తులకు సైబర్ నేరాలపై అవగాహన సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ కొత్త వ్యక్తులకు ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలు చెప్పొద్దని సూచించారు. జెరాక్స్ సెంటర్‌లో పొరపాటున కూడా వాటిని మరచి పోవద్దన్నారు. మత్తు పదార్థాలకు పిల్లల్ని దూరంగా ఉంచాలని తెలిపారు. ప్రధాన దేవాలయాలకు సీసీ కెమెరాలు అమర్చుకోవాలని గ్రామస్తులకు సూచించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

క్రోసూరు: అనంతవరం గ్రామానికి చెందిన షేక్ కరిముల్లా(44) గత నెల 30వ తేదీ నడుస్తూ అదుపు తప్పి సీసీ రోడ్డు పై పడిపోగా తలకు గట్టిగా దెబ్బ తగిలింది. క్షతగాత్రుడిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్ఐనాగేంద్రరావు తెలిపారు.

డ్రగ్స్ నియంత్రణపై అవగాహన



దొడ్లేరు(క్రోసూరు): మండలం దొడ్లేరు గ్రామంలో డ్రగ్స్ నియంత్రణ పై అవగాహన సదస్సును ఎస్ఐ నాగేంద్రరావు శనివారం రాత్రి ఏర్పాటు చేశారు. ప్రజలు, యువత మాదక ద్రవ్యాలు, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాలు ఎవరైనా విక్రయిస్తుంటే పోలీసులకు తెలియజేయాలన్నారు. దొంగతనాలు అరికట్టడానికి సీసీ కెమెరాలు ఏర్పాటుకు గ్రామ పెద్దలు సహకారం అందిచాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ఎంఈఓ తనిఖీ



అచ్చంపేట: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను తహసీల్దారు జి.శ్రీనివాసయాదవ్ శనివారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం, విద్యార్థుల హాజరు, స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. కాస్మోటిక్స్‌పై ఆరా తీశారు.విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు. భోజనంపై సంతృప్తి వ్యక్తం చేశారు.

‘కోడ్’ కూసినా..మొద్దు నిద్ర ఏల!



తారకరామ సాగర్‌లో ముసుగు పడని ఎన్టీఆర్ విగ్రహం

సత్తెనపల్లి: ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలై.. కోడ్ అమల్లోకి వచ్చినప్పటికీ సత్తెనపల్లిలో అధికార యంత్రాంగానికి పట్టినట్టు లేదు. పట్టణంలో ప్రజా ప్రతినిధులు, రాజకీయ నేతల ఫ్లెక్సీలు, కటౌట్లు దర్శన మిస్తున్నప్పటికీ చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఏరియా వైద్యశాల, రఘురాంనగర్ లో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు ఉన్నాయి. రైల్వేస్టేషన్ రోడ్డులోని తారకరామ సాగర్‌లో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహానికి ఎలాంటి ముసుగు వేయలేదు. కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఫోటోలు దర్శన మిస్తున్నాయి. కానీ, అధికారులకు మాత్రం అవి కనిపించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

విగ్రహాలు ధ్వంసంపై నిష్పక్షపాత విచారణ జరగాలి

క్రోసూరు: విగ్రహాలు ధ్వంసం చేసిన ఘటనపై నిష్పక్షపాతంగా విచారించి. దోషులపై చర్యలు తీసుకోవాలని శనివారం సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు తిమ్మిశెట్టి హనుమంతరావు పోలీసులను కోరారు. స్థానిక ఆమంచి భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతు భరోసా కేంద్రం వద్ద ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో విగ్రహాలను ధ్వంసం చేసిన ఘటనలో దోషులను గుర్తించి శిక్షించాలని కోరారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీస్ అధికారులు వెంటనే నిచారణ చేపట్టి, నిజాలను బహిర్గతం చేయాలని కోరారు. నియోజకవర్గంలో ఇలాంటి ఘటన తరచూ జరుగుతున్నాయని, కానీ అధికారులు ఎప్పుడూ నిజాలను బహిర్గతం చేయలేదని ఆరోపించారు. అందు వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయన్నారు. సీపీఎం నాయకుడు రావేళ్ల వెంకటేశ్వర్లు ఉన్నారు.

నేడు శ్రీ భగవాన్ గీతా యజ్ఞం

లక్ష మందితో కోటి నామోత్సవం



మాచర్ల: మాచర్ల పట్టణంలో నేడు సర్వజీవ శ్రేయస్సు, సర్వలోక శాంతికోసం కోటి నామోత్సవ యజ్ఞం, శ్రీ భగవద్గీతను నిర్వహించనున్నట్లు పరబ్రహ్మ కాశీవిశ్వనాథ స్వామి తెలిపారు. శనివారం శ్రీశైలం రోడ్డులోని ఆశ్రమంలో ఆయన వివరాలు తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో సత్సంగాలు నిర్వహిస్తూ భక్తియోగ కార్యక్రమ పారాయణం జరుగుతుందన్నారు. గుంటూరు రోడ్డులోని చెన్నకేశవ కాలని ఎదురు ఫిబ్రవరి 2వ తేదీ ఆదివారం లక్షమందితో శ్రీ భగవాన్ గీతా యజ్ఞం, భక్తి యోగా పారాయణంలో భాగంగా కోటి నామోత్సవం నిర్వహిస్తామన్నారు. తెల్లవారురుఝామున ఓంకారం, సుప్రభాతం, అభిషేకాలు నిర్వహించిన అనంతరం యజ్ఞం, కోటి నామోత్సవ కార్యక్రమం లక్షమందితో జరుపుతామన్నారు. మాచర్ల నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ప్రజలకు కులమతాలకతీతంగా అన్నదానం చేయనున్నామని స్వామీజీ తెలిపారు. నియోజకవర్గ చరిత్రలోనే ఇంతటి భారీ కార్యక్రమంలో పాల్గొని ప్రజలు స్వామి దివ్య ఆశీస్సులు పొందాలన్నారు.

సబ్ కోర్టు రికార్డ్ అసిస్టెంట్ మృతి



వల్లూరి శ్రీనివాస రావు (ఫైల్)

సత్తెనపల్లి: పట్టణంలోని సబ్ కోర్టు ఉద్యోగి, మండల లీగల్ సర్వీస్ అథారిటీ రికార్డ్ అసిస్టెంట్ వల్లూరి శ్రీనివాసరావు (58) గుండెపోటుతో శుక్రవారం రాత్రి గుంటూరులోని తన గృహంలో మృతి చెందారు. శ్రీనివాసరావు కోర్టు విధులు ముగించుకుని ఇంటికి వెళ్లిన తర్వాత ఒక్కసారిగా గుండెపోటుకు గురయ్యారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. శనివారం శ్రీనివాసరావు మృతదేహాన్ని కోర్టు సిబ్బంది, పలువురు న్యాయవాదులు సందర్శించి నివాళులర్పించారు. ప్యానల్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే శ్రీనివాసరావు గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమన్నారు.

ఏపీ ఎన్‌జీజీఓస్ జనరల్ సెక్రటరీకి సత్కారం



సత్కరించిన ఉద్యోగులు

సత్తెనపల్లి: ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ అండ్ గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీగా నియమితులైన విద్యాసాగర్ మొదటిసారి గుంటూరు జిల్లా నాన్ గెజిటెడ్ అండ్ గజిటెడ్ ఆఫీసర్స్ హోమ్‌కి శనివారం వచ్చిన సందర్భంగా ఏపీ ఎన్‌జీజీఓస్ సత్తెనపల్లి, క్రోసూరు యూనిట్ బాధ్యులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. విద్యాసాగర్‌ను సత్కరించారు. సత్తెనపల్లి యూనిట్ అధ్యక్షుడు పెండెం మణిరావు, సెక్రెటరీ అంబేడ్కర్, ట్రెజరర్ కోటేశ్వరరావు, ఏపీ ఎన్‌జీజీఓస్ క్రోసూర్ యూనిట్ అధ్యక్షుడు షేక్ బాషా, సెక్రటరీ మహేష్ ఉన్నారు.

చిల్లరకు ‘పది’ంతల కష్టం



పది రూపాయాల నోట్లు



కెనరా బ్యాంక్‌లో రూ.10 నాణేల పంపిణీ

- మార్కెట్‌లో తగ్గిన రూ.10 నోట్ల చలామణి
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు, చిరు వ్యాపారులు

సత్తెనపల్లి: పది రూపాయల నోటు చలామని ప్రస్తుతం మార్కెట్‌లో తక్కువగా ఉంది. దీంతో వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చలామణిలో ఉన్న నోట్లు చిరిగినవి, బాగా దెబ్బతిన్న నోట్లు తప్ప కొత్తవి రావడం లేదు. ఉన్న పది రూపాయల నోట్లు జేబులో పెట్టుకుంటే చిరిగిపోయేలా ఉన్నాయి. నిరక్షరాస్యులైన వ్యాపారులు, ప్రజలు చిరిగిన నోట్లను తీసుకునేందుకు విముఖత వ్యక్తం చేస్తున్నారు. రూ.10 నాణెం ఉన్నా పెద్దగా చలామణిలో లేదు. చిరు వ్యాపారులు, కూరగాయల దుకాణాలు, చిన్న హోటళ్లు, టీ కొట్టులు, ఆటో వాలాలు, బస్సుల్లో చిల్లర ఎఫెక్ట్ బాగా ఉంది. రూ.100 నోటు ఇస్తే తిరిగి చిల్లర ఇచ్చేందుకు వ్యాపారులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

రూ.10 నాణేలు పంపిణీ

రూ. 10 నోట్లు లేక క్షేత్రస్థాయిలో చిరు వ్యాపారులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను పరిగణలోకి తీసుకున్న కెనరా బ్యాంక్ సత్తెనపల్లి బ్రాంచ్ ఆధ్వర్యంలో ఖాతాదారులకు పది రూపాయల నాణేలను పంపిణీ చేశారు.

డిజిటల్ చెల్లింపులతో కొంత మేలు

చెల్లింపులతో చెలామణిలో చిల్లర సమస్య చాలా వరకు తీరింది. కానీ, బస్సుల్లో యూపీఐ చెల్లింపులకు..కండక్టర్ వద్ద ఉన్న ఆర్టీసీ యాప్ సక్రమంగా పనిచేయడం లేదని ప్రయాణికులు అంటున్నారు. చిల్లర సమస్య ఉందని భావించిన కొందరు రూ.10 నోట్లను భద్రపరుచుకుంటున్నారు. బ్యాంకుల ద్వారా రూ.10, రూ.20 నోట్లు విరివిగా విడుదల చేసి, వ్యాపారాల లావాదేవీలకు అంతరాయం కలగకుండా చిల్లర సమస్యను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25439 (సత్తెనపల్లి)
90100 01840 (పెదకూరపాడు)
Office mail : sakshigntadvt@gmail.com